అకాల వర్షంతో భారీ నష్టం

- వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- కల్లాల్లో తడిసిన మిర్చి
- నేలవాలిన వరి, అరటి, మక్కజొన్న
- మామిడి రైతులకు తీరని నష్టం
- క్షేత్ర పరిశీలన చేసిన అధికారులు

మంగపేట:దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట : వడగండ్లతో రాలిన వరి పైరును చూపిస్తున్న బడే నాగజ్యోతి

ఏటూరునాగారం, ఏప్రిల్ 8 : సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు, శంకరాజుపల్లి, రామన్నగూడెం, రాంనగర్, చెల్పాక, అల్లంవారిఘనపూర్ ప్రాంతాల్లో మిర్చి పంట వందల ఎకరాల్లో వరి, మక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. మామిడి, చింతకాయ నేలమట్టమైంది. కాగా, మండలంలోని ముల్లకట్ల, అల్లంవారి ఘనపూర్, రొయ్యూరు గ్రామాల్లోని దెబ్బతిన్న వరి పంటను అధికారులు పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు, సివిల్ సప్లై డీఎం, మండల ప్రత్యేకాధికారి రాంపతి, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఏవో వేణుగోపాల్, ఎంపీవో కుమార్, ఇతర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అల్లంవారి ఘనపూర్‌లో రోడ్డుకు అడ్డంగా చెట్లు పడడంతో కాంగ్రెస్ నాయకులు చిటమట రఘు, దేవేందర్ తొలగించారు.

మామిడి రైతులకు భారీ నష్టం

గోవిందరావుపేట : మండలంలో మామిడి తోట రైతులకు భారీ నష్టం వాటిల్లింది. చెట్టుపై ఒక్క కాయ లేకుండా నేలరాలిపోవడంతో రైతులు తమ కన్నీటి బాధను వెలిబుచ్చుకుంటున్నారు. మండలంలోని పస్రా, రాంపూర్, గోవిందరావుపేట, చల్వాయి, దుంపిల్లగూడెం గ్రామాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలమట్టమైంది. రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. పలు ఇండ్లపై ఉన్న రేకులు లేచిపోయాయి. పంట నష్టంపై అధికారులు సర్వేను ప్రారంభించారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి : బడే నాగజ్యోతి

గోవిందరావుపేట మండలంలో దెబ్బతిన్న వరి, మామిడి పంటలను మంగళవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహానాయక్ కలిసి పరిశీలించారు. వడగండ్ల వానతో నష్టపోయిన వరి రైతుకు ఎకరానికి రూ.50వేలు, ఇల్లు కోల్పోయిన వారికి రూ.5లక్షలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆమె వెంట నాయకులు పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, పూర్ణ చందర్, మల్లేశ్‌గౌడ్, ఐలయ్య, మల్లమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

రూ.10వేల తక్షణ సాయం : ఆర్డీవో వెంకటేశ్

వడగండ్ల వానతో నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణ సాయంగా రూ.10వేలు అందిస్తామని ములుగు ఆర్డీవో వెంకటేశ్ అన్నారు. గోవిందరావుపేట మండలంలో వడగండ్ల వానతో దెబ్బతిన్న మామిడి తోటలను ఆయన పరిశీలించారు. నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి తోపాటు అధికారులు ఉన్నారు.

పంటలు పరిశీలించిన అధికారులు

ములుగురూరల్ : ములుగు, మల్లంపల్లి మండలాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. రెండు మండలాల వ్యాప్తంగా మక్కజొన్న 150ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. అదేవిధంగా రెండు మండలాల్లో దెబ్బతిన్న పంట తోటలను ఉద్యాన వన శాఖ జిల్లా అధికారి శ్రీకాంత్ పరిశీలించారు. ములుగు, రామచంద్రాపురం, జాకారం, అబ్బాపురం గ్రామాల్లోని మామిడి, అరటి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నట్లు గుర్తించామని తెలిపారు. 20ఎకరాల్లో మామిడి, 15ఎకరాల్లో బొప్పాయి, 44ఎకరాల్లో అరటి తోటల్లో నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. కాగా, పంట నష్ట వివరాల కోసం ములుగు మండల వ్యవసాయ అధికారి పరమేశ్వర్‌ను వివరణ కోరగా తహసీల్దార్‌తో కలిసి పంటల పరిశీలన చేశామని, మండల వ్యాప్తంగా ఎలాంటి పంటనష్టం జరగలేదని, రామచంద్రాపురంలో మక్కజొన్న క్రాప్ స్టేజ్‌లో ఉందన్నారు.

నేలవాలిన వరి, మక్కజొన్న పంటలు

తాడ్వాయి : మండలంలోని పలు గ్రామాల్లో వరి, మక్కజొన్న పంట నేలమట్టమైంది. పలు గూనపెంకుల ఇళ్లతో పాటు రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. గాలికి రేకులు ఎగిరిపోవడంతో ఇళ్లలోని నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. విలువైన వస్తువులు పాడైపోయాయి. కరెంట్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డీపీవో దేవరాజ్‌తోపాటు తహసీల్దార్ సురేశ్ బాబు, ఎంపీడీవో సుమనవాణి, ఎంపీవోలు మండలంలోని నార్లాపు రం, మేడారం, ఊరట్టం, కొత్తూ రు, కాల్వపల్లి, కన్నెపల్లి, జంపంగవాయి తదితర గ్రామాల్లో మంగళవారం సర్వే నిర్వహించారు. మొత్తం 14ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. నేడు లింగాల, బందాల గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

2500 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట

మంగపేట : మండలంలోని నర్సింహసాగర్, మల్లూరు, బాలన్నగూడెం, చుంచుపల్లి, తిమ్మంపేట గ్రామాల్లో వరి పంటతో పాటు, మక్కజొన్న, కల్లాల్లో ఆరబోసిన మిర్చి దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 2500ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారి చేరాలు తెలిపారు. పంట నష్టంపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. అడిషన్ కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి ఆయన నర్సింహసాగర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టం వివరాలు సేకరించి అందజేయాలని అధికారులను ఆదేశించారు. సందర్శనలో తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో భద్రు, వ్యవసాయశాఖ అధికారి చేరాలు, ఏఈవోలు ఆకా మహేశ్, గాయత్రి, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, వైస్‌చైర్మన్ కాడబోయిన నరేందర్ ఉన్నారు. అనంతరం మల్లూరు హేమాచల లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని కలెక్టర్ సందర్శించారు. మే నెలలో జరుగనున్న కల్యాణ బ్రహ్మోత్సవాలకు కావలసిన ఏర్పాట్లపై ఈవో సత్యనారాయణ, అధికారులతో కలెక్టర్ చర్చించారు.

గాలి దుమారంతో దెబ్బతిన్న అరటి తోట

వెంకటాపూర్ : మండల కేంద్రానికి చెందిన పిట్టల సురేశ్, పిట్టల నారాయణలు సాగు చేసిన మూడు ఎకరాలు అరటి తోట పూర్తిగా నేలమట్టమైంది. ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

గాలికి విరిగిన ఇంటి రేకులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్తలో సోమవారం రాత్రి ఉధృతంగా వీచిన గాలి దుమారానికి పోలెటి సరోజన(60) ఇంటి రేకులు విరిగి మీద పడ్డాయి. దీంతో వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. వంద పడకల ఆసుపత్రికి తరలించారు. పోలేటి సరోజన తన ఇల్లు కూలింది.

నేలకొరిగిన పంటలు

టేకుమట్ల : అంకుషాపూర్‌కు చెందిన కౌలు రైతు అబ్బెంగుల సురేందర్ 2ఎకరాల్లో మక్కజొన్న పూర్తిగా నేలమట్టమైందని కౌలు మీద పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 450ఎకరాల్లో మక్కజొన్న నేలమట్టమైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం : మండలంలోని కనుకునూర్ గ్రామానికి చెందిన చాట్ల జంగయ్య, బంధం బాబు, బోర్లగూడెం గ్రామంలో రైతు భూక్యా రాంలాల్‌కు చెందిన వరి పంటలు నేలమట్టమయ్యాయి. మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి.

ఈదుర గాలులతో అపార నష్టం..

చిట్యాల : మండల కేంద్రంతోపాటు ఏలేటిరామయ్యపల్లి, కైలాపూర్, చిట్యాల గ్రామాల్లో మూడు గంటలపాటు వర్షం బీభత్సం సృష్టించింది. రామచంద్రపురం గ్రామంలో సుమారు 30ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగినట్లు హార్టికల్చర్ డివిజనల్ అధికారి సునీల్ తెలిపారు. గ్రామానికి చెందిన క్యాతం రమేశ్, ఆకుల సతీశ్‌లకు చెందిన అరటి తోటలు నేలమట్టమయ్యాయి. రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలో అకాల వర్షం..

మహదేవపూర్(కాళేశ్వరం) : మండలంలో మంగళవారం రాత్రి సుమారు గంటపాటు కురిసిన అకాల వర్షానికి పలు చోట్ల పంట పొలాలు నెలకొరిగాయి. కల్లాలోని మిర్చి తడిసింది. భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


టేకుమట్ల : అంకుషాపూర్‌లో నేలవాలిన మక్కజొన్న

గోవిందరావుపేట : దయ్యాలవాగు సమీపంలో నేలరాలిన మామిడితో స్వామి దంపతులు

చిట్యాల : నష్టం వాటిల్లిన అరటి తోట వద్ద రైతు క్యాతం రమేశ్

ప్రభుత్వం ఆదుకుంటుంది : మంత్రి సీతక్క

ములుగురూరల్, ఏప్రిల్ 8 : అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నష్టపోయిన పంటలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

భూసేకరణ సర్వే పనుల అడ్డగింత

కాటారం, ఏప్రిల్ 8 : మండలంలోని జాదరావుపేట రెవెన్యూ పరిధిలో చిన్న కాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీల భూసేకరణ కోసం చేపట్టిన సర్వేను మంగళవారం పలువురు రైతులు అడ్డగించారు. మెయిన్ కెనాల్ నుంచి వెళ్లే డిస్ట్రిబ్యూటరీ కోసం డీఐవోఎస్ రాము ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వేను రైతులు నిలిపేశారు. కెనాల్ కాకుండా పైప్‌లైన్ వేయాలని లేదా అలైన్‌మెంట్ మార్చాలని అధికారులకు తెలిపారు. ఈ విషయాన్ని బందోబస్తుకు వెళ్లిన పోలీసులు ఇరిగేషన్ డీఈఈ ఉపేందర్, ఏఈ వెంకన్న దృష్టికి తీసుకెళ్లగా, వారు వెళ్లి రైతులతో మాట్లాడారు. తమకున్న కొద్ది పాటి భూమిని కెనాల్ కోసం కోల్పోతున్నామని, అలైన్‌మెంట్ మారిస్తే ఇబ్బంది ఉండదని తెలిపారు. అన్ని రకాలుగా ఆలోచించే సర్వే చేపట్టారని, అభ్యంతరం తెలిపితే సర్వేను నిలిపేస్తామని చెప్పగా రైతులు కొద్ది రోజులు సమయం కావాలని, అందరం మాట్లాడుకుని చెప్తామన్నారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. రఘుపల్లి, జాదరావుపేట, గూడూరు రైతులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కెనాల్‌పై గ్రామ సభ

మహదేవపూర్, ఏప్రిల్ 8 : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ తవ్వకాల భూసేకరణపై మంగళవారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. గ్రామ శివారులో చేపట్టనున్న కాల్వల తవ్వకాల గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించి వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఏఈఈ భరత్‌ఆనంద్, సర్వేయర్ రాజారమేశ్, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

కుంగిన కాజ్‌వే..రాకపోకలు బంద్

మంగపేట, ఏప్రిల్ 8 : మండలంలోని కొత్తూరుమొట్లగూడెం-బొమ్మాయిగూడెం మధ్య ఉన్న కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షానికి కుంగి రోడ్డుపై అడ్డంగా భారీ గుంత ఏర్పడింది. దీంతో ఇరు గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో కనీసం టూవీలర్ కూడా నడవడానికి వీలు కాని పరిస్థితి ఏర్పడింది. మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మంచినీటి సమస్య లేకుండా చూడాలి

గణపురం, ఏప్రిల్ 8 : గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని డీపీవో నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం గణపురం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా ప్రతికాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి విజేందర్, జీపీ సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వెంకటాపురం(నూగూరు)/వాజేడు, ఏప్రిల్ 8 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు అన్నారు. మంగళవారం వెంకటాపురం మండల పరిధిలోని ఉప్పేడు వీరాపురం, వెంకటాపురం, బర్లగూడెం, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ, ఏవో నవీన్, సిబ్బంది పూర్ణ, ఏఈవో శ్యామ్ ఉన్నారు. అలాగే, వాజేడు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి చర్ల(నూగూరు) వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పునెం రాంబాబు ప్రారంభించారు. పేరూరు, ప్రగళ్లపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు సంఘ సీఈవో సోమ సత్యనారాయణ తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ యగ్గడి అంజయ్య, ఉపాధ్యక్షుడు వాత్సవాయి జగన్నాథరాజు, తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఏఈవో జాఫర్ పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు బలిగొంటున్న మావోయిస్టులు

ములుగురూరల్, ఏప్రిల్ 8 : రక్షణ పేరుతో కర్రిగుట్టపై మావోయిస్టులు ప్రెజర్ మైన్స్ అమర్చి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొంటున్నారని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అమాయక గిరిజన, గిరిజనేతరులపై పోలీస్ ఇన్‌ఫార్మర్లు అని ముద్ర వేస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో వారిని హతమారుస్తూ మావోయిస్టులు తమ ఉనికి చాటుకుంటున్నారని అన్నారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ మావోయిస్టులు అమర్చుతున్న ప్రెజర్ బాంబులు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా మైన్స్ కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

అర్చకుడి కారు అద్దం ధ్వంసం

గణపురం, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామాలయ అర్చకుడు ముసునూరి నరేశ్ కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ధ్వంసం చేశారు. తన ఇంటిముందు కారు నిలిపి ఉంచి దేవాలయంలో పూజలు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో కారు అద్దాలను ధ్వంసం చేశారని ఆయన తెలిపారు. కారు వెనుక భాగంలోని అద్దం పూర్తిగా ధ్వంసమైంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అర్చకుడు నరేశ్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ములుగు, ఏప్రిల్8 (నమస్తే తెలంగాణ) : ఇద్దరిపై కేసు నమోదైన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీన ములుగు మండలంలోని ఇంచర్ల వద్ద వేములపల్లి భిక్షపతి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టిన సదరు వ్యక్తి అయిన జంగిలి రవితేజపై భిక్షపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు రవితేజపై కేసు నమోదు చేశారు. కాగా, మరుసటి రోజు దెబ్బతిన్న తన కారు మరమ్మతు కోసం రూ.10లక్షల పరిహారం చెల్లించాలని భిక్షపతి తనను తుపాకీతో బెదిరించాడని రవితేజ పీఎస్‌లో ఈ నెల 6న ఫిర్యాదు చేశాడు. దీంతో భిక్షపతిపై సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, రవితేజ బీఆర్ఎస్ నాయకుడిగా, జడ్పీ మాజీ చైర్‌పర్సన్‌కు పీఆర్వోగా పని చేస్తుండగా భిక్షపతి బీఆర్ఎస్ పార్టీ నేతగా కొనసాగుతున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చిట్యాల, ఏప్రిల్ 8 : మండలంలోని అందుకుతండా శివారు ఒంటిప్పతండా గ్రామానికి చెందిన మహమ్మద్ జోరంబి అనే వృద్ధురాలికి కళ్లు కనిపించపోవడంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఆమెకు కుటుంబ సభ్యులు వంతుల వారీగా భోజనం అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె కోడలు మహమ్మద్ రజియా(45) ఈ నెల 06న భోజనం వడ్డించేందుకు వెళ్లగా వారిద్దరి మధ్య కూర విషయంలో మాటలు అనుకున్నారు. ఇదే విషయంపై భర్త జహీరుద్దీన్‌తో తీవ్రంగా గొడవ జరిగింది. అక్కడి నుంచి కూరగాయల కోసం ఆమెను భర్త తోటకు తీసుకెళ్లడంతో మళ్లీ వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రజియా క్షణికావేశంలో అక్కడే ఉన్న పురుగుల మందు తాగింది. భర్త ఆమెను వెంటనే చిట్యాలలోని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అక్కడే మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు మస్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..

చిట్యాల, ఏప్రిల్ 8 : మండలంలోని వెంచరామి గ్రామానికి చెందిన తోట లక్ష్మణ్ (28) తన అమ్మానాన్న చనిపోవడంతో అదే గ్రామంలో డ్రైవర్ వృత్తి చేసుకుంటూ వాళ్ల చిన్నమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈనెల 5న తనకంటే చిన్నవాళ్లకు పెళ్లిళ్లు అవుతున్నాయని, తనకు కావట్లేదని మనస్తాపం చెంది మద్యం మత్తులో ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చిట్యాల సివిల్ దవాఖానకు తరలించగా వైద్యుల సూచన మేరకు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి లక్ష్మణ్ మృతి చెందాడు. చిన్నమ్మ కూతురు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

ములుగురూరల్, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రం పరిధిలోని మేడివాగు సమీపంలోకి గుంపెల్లి నాగేంద్రకు చెందిన పాడి గేదె మేతకు వెళ్లింది. పంట పొలాల్లో మేత మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.60వేలు ఉంటుందని నాగేంద్ర తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

అధికారులతో సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 8 : యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, సహకార, వ్యవసాయ, డీఆర్డీఏ, తూనికలు కొలతలు, కార్మికశాఖల అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ రాహుల్‌శర్మ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఏసీఎస్, ఐకేపీకి కేటాయించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించాలని సూచించారు. 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2320, 'బీ' గ్రేడ్ రకానికి రూ.2300 మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 శాతం కొనుగోలు కేంద్రాలు మహిళా సమాఖ్యలకు కేటాయించాలని ఆదేశించారు. ప్రభుత్వ నియమనిబంధనలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లింపు ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాములు, డీఆర్డీవో నరేశ్, వ్యవసాయ అధికారి వీరూనాయక్, జిల్లా సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ ఏడీ కనకశేఖర్, తూనికలు కొలతలు శాఖ అధికారి శ్రీలత, సహాయ కార్మిక శాఖ అధికారి వినోద పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం కిందికి ఈఎస్ఎస్

- మంజూరైన స్కీంల సబ్సిడీ రద్దు
- లబ్ధిదారులకు చేజారిన యూనిట్లు

ఏటూరునాగారం, ఏప్రిల్ 8 : గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఐటీడీఏలో కొనసాగుతున్న ఎకనామికల్ సపోర్టు స్కీం (ఈఎస్ఎస్) కాస్త రాజీవ్ యువ వికాసం గొడుగు కిందికి పోయింది. 2006సంవత్సరం నుంచి ఈ పథకం ఐటీడీఏలో కొనసాగుతున్నది. నిరుపేద గిరిజనులు ఉపాధి ద్వారా ఆదాయం పొందేందుకు ఈ పథకం అమలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ రాజీవ్ యువ వికాసం పథకం అమల్లోకి రావడంతో గతంలో ఎకనామికల్ సపోర్టు స్కీం కింద మంజూరు చేసిన సబ్సిడీ రద్దు చేశారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను ములుగు జిల్లాలో 126మంది గిరిజనులకు రూ.1.63 కోట్లతో యూనిట్లు మంజూరు చేశారు. కాగా, ఇందులో 122 మందికి రూ1.16 కోట్ల సబ్సిడీకి సంబంధించి చెక్స్ జనరేట్ చేశారు. కానీ సంవత్సరం కావస్తున్నప్పటికీ సబ్సిడీ విడుదల కాలేదు. ఇక 2021-22లో జిల్లాలో 769 యూనిట్లకు గాను రూ. 6.15కోట్లు కేటాయించారు. ఇందులో 454యూనిట్లను రూ.4కోట్లతో మంజూరు చేశారు. ఇందులో 429మందికి రూ.3.79 కోట్ల సబ్సిడీ చెక్కులు జనరేట్ చేయగా ఇందులో రూ.1.68కోట్లు మాత్రమే లబ్ధిదారులకు సబ్సిడీ విడుదలైంది. ఇందులో రూ. కోటి విలువ చేసే 125యూనిట్లు మాత్రమే గ్రౌండింగ్ చేశారు. అయితే సబ్సిడీ విడుదలైనప్పటికీ బ్యాంకర్లు సహకరించకపోవడంతో యూనిట్లు గ్రౌండింగ్‌కు నోచుకోనట్లు తెలుస్తోంది. దీంతో వచ్చిన సబ్సిడీ పూర్తిగా రద్దు అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే గత స్కీంలకు సబ్సిడీని రద్దు చేస్తూ కొత్తగా రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ అధికారులు సూచిస్తున్నట్లు తెలుస్తున్నది. రాజీవ్ యువ వికాసంలోనే ఈఎస్ఎస్ కింద స్కీంలు ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 2020-21, 2021-22 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న వారికి సబ్సిడీ రద్దు కావడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రాజీవ్ యువ వికాసం కింద ములుగు జిల్లాకు 2491 యూనిట్లకు రూ. 27కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

పేదలకు ఆహార భద్రత కల్పించడమే లక్ష్యం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 8 : పేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్ కాలనీలో నివసిస్తున్న ఎస్టీ లంబాడా సామాజిక వర్గానికి చెందిన బానోత్ రాజేందర్-మౌనిక నాయక్ దంపతుల ఇంట్లో ప్రభుత్వం అందించిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని వారి కుటుంబ సభ్యులు, కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నేలపై కూర్చుని భోజనం చేశారు. రాజేందర్ కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయంగా సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో సహపంక్తి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. భోజన అనంతరం రాజేందర్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నూతన వస్త్రాలు అందజేశారు. అంతకు ముందు జైభీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర భూపాలపల్లి పట్టణంలోని 4,23,24,25వ వార్డులలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా, మండల అధికారులు, భూపాలపల్లి మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో వండిన అన్నం తింటున్న ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్

మా పిల్లలను మా వద్దక